క్లుప్తంగా

డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు నివాళి



బాబూ రాజేంద్రప్రసాద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం వినోద్ కుమార్

పెదగంట్యాడ: మాజీ రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ సేవలు మరువలేమని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని చేపలపాలెం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పాఠశాలలో బాబూ రాజేంద్రప్రసాద్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు.

గంజాయి కలిగిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి కలిగిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ఎస్.ఎస్.వి ప్రసాదరావు తెలిపిన వివరాలివి.. నిందితుడు బోలెం కన్నబాబు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.వి.పి నగర్, కొబ్బరితోటలో నివాసం ఉంటున్నాడు. 2013 డిసెంబర్ 20న అప్పటి టూటౌన్ ఇన్‌స్పెక్టర్ వై.గోవింద రావు ఉదయం తనిఖీలు చేస్తున్న సమయంలో నిందితుడు కన్నబాబు నుంచి రెండు గోనె సంచులతో 13.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై సెక్షన్ 20 బి, ఎన్‌డీపీఎస్ చట్టం కిందట కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లు అందజేస్తున్న బిషప్ మహంతి

గాజువాక: స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మిషన్లను శుక్రవారం పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గాజువాక: అమ్మ వాసవీ సేవా ట్రస్టు ప్రతినిధులు గాజువాకలో నిరుపేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. ట్రస్టు సభ్యుడు బొగ్గాపు వెంకటేశ్వరరావు నిధులతో సమకూర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కులుకూరి మంగరాజు, కారుమూరి మహేష్, వరద కృష్ణ, పూసర్ల వెంకటేశ్వరరావు, కట్టా సతీష్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సంధ్యాదేవి

డాబాగార్డెన్స్: ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యాదేవిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏఎంసీ ఓబీజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

7 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1లోని కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 7న సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 11న సాయంత్రం 7 గంటలకు లక్ష కుంకుమార్చన ,12న ధ్వజావరోహణం, చక్రస్నానం, సాయంత్రం పుష్పయాగం, ఉయ్యాల సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సృజనకు పదును..

మెదడుకు మేత



రామకృష్ణ స్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



బహుమతులు అందుకున్న లంకెలపాలెం విద్యార్థులు



సైంటిస్టుల ఫొటోలు ప్రదర్శిస్తున్న అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు

అగనంపూడి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు. విద్యార్థులు వారి ఆలోచన శక్తికి పదును పెట్టి నమూనాలు తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల హెచ్‌ఎం రొతు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఉత్తమ ప్రదర్శనలకు లుపిన్ ఫార్మా హెచ్‌ఆర్ మేనేజర్ వెంకటనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు బి.వి.సన్యాసిరావు, రాజశేఖర్, శాంతి పాల్గొన్నారు.

- పెదముషిడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీవీరామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించి ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, సైన్స్ ఉపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.
- లేమర్తి ఫార్మాసిటీ నిర్వాసితకాలనీలో సీవీరామన్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమ్మాజీ, ఉపాధ్యాయులు వెంకటరావు పాల్గొన్నారు.
- పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొండబాబు, సీహెచ్ పెద్దినాయుడు పాల్గొన్నారు.
- విజ్ఞాన్ విద్యార్థులు ఏర్పాటు చేసిన సెన్స్ ఎక్స్‌పోను కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు ప్రారంభించారు.
- కూర్మన్నపాలెంలోని శ్రీరామకృష్ణ పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పొన్నాడ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ లలిత కుమారి పాల్గొన్నారు..
- అగనంపూడి నిర్వాసితకాలనీలోని స్టార్‌డమ్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌నుఆర్‌ఈసీఎస్ ఈఈ ఎస్.రామకృష్ణ సందర్శించారు.

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్విజ్, పీపీటీ మోడల్ ప్రెజెంటేషన్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ పాల్గొన్నారు.

- స్థానిక చైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్యామల, కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి పాల్గొన్నారు.
- జాతీయ సైన్స్ దినోత్సవాన్ని స్థానిక రవీంద్ర భారతి స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ శిరీష, పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఆర్.కవిత పాల్గొన్నారు.

పెదగంట్యాడ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు అన్నారు. 50 మంది సైంటిస్టుల ఫొటోలను ప్రదర్శించారు.

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఎగ్జిబిషన్‌ను కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సీఎస్ఆర్ ప్రతినిధులు ఎ.రాము, కుమారి సందర్శించారు. శ్రీ సాయి శర్వాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ చంద్రమౌళి, భార్గవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధానకార్యదర్శి సంగ్రాన నూకరాజుపాల్గొన్నారు.



యారాడ హైస్కూల్లో శాస్త్రవేత్తల చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



చైతన్య మహిళా కళాశాలలో..



ఎంవీఆర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత



ఆలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు.ఈ మేరకు శుక్రవారం పలువురు దాతలు విరాళాలు ఇచ్చారు. అక్కిరెడ్డిపాలెంకు చెందిన కోనెం రవీంద్రబాబు, కోనెం గౌరీప్రసాద్ సోదరులు రూ.35,001 నగదును ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

- అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి యూఎస్ఏలో ఉంటున్న అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రాపేటి సత్యనారాయణ 300 యూఎస్ఏ డాలర్లను (ఐఎన్ఆర్ రూ.24,368) అందజేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.
- బొడ్డు రమణ కుమారుడు బొడ్డు శ్రవణ్ కుమార్ (బుజ్జి), బొడ్డు నాగరత్నం దంపతులు రూ.5116 ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.
- విశ్రాంత ఆర్‌టీసీ ఉద్యోగి ఉప్పిలి అప్పల నర్సయ్య పెద్ద కుమారుడు ఉప్పిలి వెంకట అప్పలరవి రూ.20 వేలు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.
- అక్కిరెడ్డిపాలెంకు చెందిన సమ్మిడి రాజు, సమ్మిడి రామకృష్ణ రూ.15,116 ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.
- అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మళ్లీడి అప్పలరాజు, వాణి దంపతులు రూ.10,116లు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న సిబ్బంది

అగనంపూడి: అగనంపూడి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి, ఐ కేర్ విజన్ సహకారంతో వాకింగ్ ట్రాక్ వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య, నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ద్వారకానాథ్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వాకర్స్‌క్లబ్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అగనంపూడి వాకర్స్‌క్లబ్ చేస్తున్న సేవ, ప్రజాహిత కార్యక్రమాలను మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య సేవలు అందించారు. రక్తపోటు, మధుమేహం, ఇతర సాధారణ జబ్బులకు ఉచిత చికిత్స అందించారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ధీరజ్ పత్రి, డాక్టర్ శివకుమార్, క్లబ్ పూర్వ గవర్నర్ డి.డి.నాయుడు, వాకర్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మడుగల నరసింగరావు, బి.రామారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బలిరెడ్డి నాగేశ్వరరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పట్టా రామఅప్పారావు, చిన్ని పూర్ణ, గుడే సుశీలా గజేంద్రరావు, విందుల పైడినాయుడు, కరణం పైడిరాజు, కె.హనుమంతురావు, బి.కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



ప్రాణాల నుంచి బయట పడిన వ్యక్తితో వైద్య బృందం

కూర్మన్నపాలెం: రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయమైన వ్యక్తికి సకాలంలో శస్త్ర చికిత్సచేసి వైద్యులు ప్రాణం పోశారు. కూర్మన్నపాలెం 4 ఎస్ ఆస్పత్రిలో అరుదైన వైద్యం అందించినట్టు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి. మురళీకృష్ణ తెలిపారు. వివరాలు.. అగనంపూడి వద్ద గతనెల 14న జరిగిన ప్రమాదంలో గొర్లివానిపాలెంకు చెందిన అప్పారావు గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతనికి డాక్టర్ పి. తపన్, డాక్టర్ సంతోష్ నేతృత్వంలో సుమారు 10 గంటలు కృషి చేసి ఆపరేషన్ పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం గాయపడిన వ్యక్తి కోలుకున్నారని ఆయన చెప్పారు. సమావేశంలో డాక్టర్ ప్రణవేంద్రనాథ్, డాక్టర్ హేమంత్, డాక్టర్ మురళీధర్, బాధితుడి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

18 కిలోల గంజాయి స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని గాజువాక పోలీసులకు అప్పగించారు. వివరాలు.. పాతగాజువాకకు చెందిన షహీం అనే వ్యక్తి రాయగడ నుంచి గంజాయి తెప్పించుకున్నాడు. పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి అతని వద్ద 18 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని షహీంను గాజువాక పోలీసులకు అప్పగించారు.

బడ్జెట్‌లో ఇంజినీరింగ్ కార్మికులకు మొండిచేయి



అక్కిరెడ్డిపాలెంలో మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న గొలగాని అప్పారావు

అక్కిరెడ్డిపాలెం: ఆప్కాస్ ఉద్యోగులతో పాటు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు బడ్జెట్‌లో మొండి చేయి చూపించిందని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ కమిటీ ప్రధానకార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. 68వ వార్డు మున్సిపల్ ఉద్యోగులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. లక్ష మందికి పైగా ఉన్న ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తుందని ఆశించినా ఈ బడ్జెట్ ద్వారా నిరాశే మిగిలిందన్నారు. 2025-26 బడ్జెట్‌లో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాల పెంపు, సంక్షేమ పథకాల అమలు ప్రస్తావన లేదని అన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకుతున్న ఇంజినీరింగ్ కార్మికులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని దుయ్యబట్టారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: కడియం-ద్వారపూడి-అనపర్తి సెక్షన్ మధ్య ఆధునికీకరణ పనులు జరుగుతున్న కారణంగా ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేశారు. ఈ నెల 1, 2వ తేదీల్లో గుంటూరు-విశాఖపట్నం(12739) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2,3వ తేదీల్లో విశాఖపట్నం-గుంటూరు(12740)సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 2న ఇరువైపులా విశాఖపట్నం-గుంటూరు-విశాఖపట్నం(22701/22702) ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, 3న లింగంపల్లి-విశాఖపట్నం(12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

టైలరింగ్ వృత్తికి ఆదరణ కరువు



సీనియర్ టైలర్లను సన్మానిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: టైలర్స్ డేను పురస్కరించుకొని బిల్ సిగ్నల్ పాయింట్ వద్ద శ్రీ వినాయక దుర్గా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కూనూరు మల్లికేశ్వరరావు మాట్లాడుతూ రోజురోజుకూ టైలరింగ్ వృత్తికి ఆదరణ తగ్గుతుందన్నారు. రడీమేడ్ అందుబాటులోకి వచ్చిన తర్వాత టైలర్ల జీవితాలు అగమ్యగోచరంగా మారిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టైలర్లను ఆదుకోవాలని, 50 సంవత్సరాలు నిండిన టైలర్లకు పింఛన్లు అందజేయాలని, టైలర్ల షాపులకు 150 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేయాలని కోరారు. అనంతరం సీనియర్ టైలర్లు భూపతి రామారావు, యలపల్లి సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగరాజు, బొడ్డు సాంబశివరావు, ఎస్.వి.రమణ, చంద్రశేఖర్, కోడి గోవింద, దొడ్డి శ్రీను, శ్రీనివాసరావు, రమణ, త్రినాథ్, శంకర్రావు, సంతోష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగ్‌ల పంపిణీ



క్లాత్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న చిత్తా శోభారాణి, రామారావు

అగనంపూడి: దర్జీల దినోత్సవం సందర్భంగా 79వ వార్డు అగనంపూడి కూడలిలోని బొర్రమాంబ లేడీస్ టైలరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో క్లాత్ బ్యాగ్‌ల పంపిణీ చేశారు. టైలరింగ్ కేంద్రం నిర్వాహకురాలు చిత్తా శోభారాణి తయారు చేసిన సంచులను మహాత్మాగాంధీ సేవా సమితి అధ్యక్షుడు చిత్తా రామారావు చేతుల మీదుగా పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ, నార, పేపర్ సంచులను మాత్రమే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో కొయ్య మోహన్, గురు సురేష్, నగరాల అప్పారావు, తరుణ్‌కుమార్, పార్వతి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగికి ఘన వీడ్కోలు



సత్కార సభలో విభాగ అధికారులు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వాటర్ మేనేజ్‌మెంట్‌విభాగం (డబ్ల్యూఎండీ)కి చెందిన టెక్నీషియన్ ప్రగడ సత్యనారాయణకు ఘనంగా వీడ్కోలు పలికారు. స్టీల్‌ప్లాంట్ నుంచి ఆయన పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద,నాయకులు ప్రగడ శ్రీను, బొడ్డ సన్యాసిరావు, దుర్గపు వాసు, ప్రగడ శంకరరావు, బి. సూరిఅబు, పి. శ్రీనివాస్, గున్న రామారావు, పి. శ్రీను, పి. రవి ప్రసాద్, సంతోష్ పాటు సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు. జ్ఞానాపురంలో సిల్వర్ జూబ్లీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షల విధులు కేటాయించిన అధికారులతో శుక్రవారం జరిగిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లను తీసుకుని వెళ్లకూడదన్నారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్‌గా ప్రకటిస్తూ ఎక్కడికక్కడ నోటీసులు అతికించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, దగ్గరలోని జిరాక్స్ షాపులను మూసి వేయించాలన్నారు. పరీక్ష ప్రశ్నాపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచడం, అక్కడ నుంచి కేంద్రాలకు తీసుకు వస్తున్నప్పుడు, తిరిగి పోస్టాఫీసుకు పంపించేటప్పుడు ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ప్రాంతీయ విద్యాసంచాలకుడు బి.విజయభాస్కర్, డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమార్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హద్దు మీరితే జేబుకు చిల్లే

పీఎంపాలెం: రోడ్డు భద్రతా నిబంధనలు మారాయి. శనివారం నుంచి డ్రైవింగ్ చేసేటప్పుడు చాలా రకాల ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. కొత్త రవాణా నియమాలు పాటించక పోతే జేబులు చిల్లు పడడం ఖాయం. శనివారం నుంచి అమల్లోకి రానున్న నిబంధనలు..

జరిమానాలు ఇలా నాడు -నేడు

లైసెన్సు లేని వ్యక్తికి వాహనం ఇస్తే : రూ.1000 రూ.5000

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే : 500 రూ.5000

మైనర్ వాహనం నడిపితే : రూ.500 రూ.10,000

అతి వేగంగా నడిపితే : రూ.400-500 రూ.1000-2000

ప్రమాదకరంగా నడిపితే : రూ.1000 రూ.10,000

రిజిస్ట్రేషన్ లేని ఫిట్‌నెస్ లేని వాహనాలకు: రూ.2000-4000 రూ.5 వేలు-8 వేలు

రేసింగ్‌లకు పాల్పడితే : రూ.1000-5000 రూ.10,000

సీటు బెల్టు ,హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే : రూ.100 రూ.1000

ఎట్టకేలకు పూర్వ డీఆర్‌ఎంకు బెయిల్

సాక్షి, విశాఖపట్నం: టెండర్లకు సంబంధించి కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు రైల్వే పూర్వ డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌కు ఎట్టకేలకు బెయిల్ మంజూరైంది. గతేడాది నవంబర్‌లో ముంబయిలో ఓ కాంట్రాక్ట్ సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ సౌరభ్‌కుమార్ దొరికిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్ కుమార్ ఉన్నారు. హిందూస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి రూ.3.17 కోట్ల బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే పనులు ఆలస్యంగా చేయడంతో రైల్వే బోర్డు భారీ జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో బిల్లులు క్లియరెన్స్‌తో పాటు జరిమానా తగ్గించేందుకు సౌరభ్‌కుమార్ రూ.30 లక్షల లంచం అడిగినట్లు సీబీఐ విచారణలో వెల్లడైంది. చివరికి రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణెలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్ హ్యాండెడ్‌గా సౌరభ్‌కుమార్ దొరికిపోయారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు(ముంబయి) తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. సౌరభ్‌కుమార్ నేరాలకు సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. నిందితుడు ఇప్పటికే సస్పెండ్ అయ్యారని తెలిపారు. సాక్ష్యాలు, రికార్డులు తారుమారు చేసే అవకాశం లేదని సీబీఐ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి అమిత్ ఖర్కర్ అన్నారు. నేరారోపణ నిరూపితమైతే శిక్ష తీవ్రతను పరిగణలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు.